## క్లుప్తంగా

### వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు

**వరికుంటపాడు:** స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో అయ్యప్ప మాలధారులు శనివారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. అయ్యప్పలకు ఆలయ నిర్వాహకులు వెంకటేశ్వరస్వామి చిత్ర పటాలు, ప్రసాదాలను అందజేశారు.

### నలందలో ఎల్లోడే



**కావలి:** పట్టణంలోని గొల్లమూడివారి వీధిలో ఉన్న నలంద ఒలంపియాడ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఎల్లో డేను శనివారం నిర్వహించారు. విద్యార్థులు పసుపు దుస్తులను ధరించి పైనాపిల్, అరటి పండ్లు, నిమ్మకాయలు, జెల్లీ, మామిడి పండ్లు, తదితర నమూనాలను ప్రదర్శించి అలరించారు. డైరెక్టర్ వసీం మాట్లాడుతూ ఎల్లో డే విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### 91 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

**ఆత్మకూరురూరల్:** మండలంలో తొలిరోజైన శనివారం 91శాతం పింఛన్ల పంపిణీని పూర్తి చేసినట్లు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. మండలంలోని వాశిలిలో పింఛన్ల పంపిణీని ఆయన పరిశీలించి లబ్ధిదారులకు నగదు అందజేశారు. మండలంలో 4,871 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా, 4,427 మందికి సచివాలయ సిబ్బంది పింఛన్లు అందజేసినట్లు వివరించారు.

**పింఛన్ల పంపిణీ పరిశీలన**

**ఉదయగిరి:** మండల కేంద్రమైన ఉదయగిరిలో పింఛన్ల పంపిణీని ఎంపీడీఓ అప్పాజీ పరిశీలించారు. మండలంలో తొలిరోజు 91.3శాతం పింఛన్ల పంపిణీని పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన వారికి సోమవారం పింఛన్లు అందజేస్తామని చెప్పారు. ఈ నెల నుంచి ఎవరైనా ఏదైనా కారణాలతో అందుబాటులో లేక తీసుకోలేకపోతే మూడు నెలల వరకు అందజేస్తామని వివరించారు. ఆ తరువాత కూడా తీసుకోకపోతే నిలిపిస్తామని తెలిపారు.

### వైభవంగా అయ్యప్ప పడిపూజోత్సవం



**ఉదయగిరి :** పట్టణంలోని బాలాజీనగర్‌లో అయ్యప్పస్వామి మహాపడి పూజోత్సవాన్ని శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై అయ్యప్పస్వామిని కొలువుదీర్చి విశేష పూజలు నిర్వహించారు. అయ్యప్ప మాల ధారులు పాల్గొని భజనలు చేశారు.

### బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



**ఆత్మకూరు:** పట్టణానికి చెందిన మృతుల కుటుంబాలకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. 12వ వార్డుకు చెందిన ఒంగోలు సరస్వతి, 13వ వార్డుకు చెందిన పాటూరు పెంచలయ్య, 19వ వార్డుకు చెందిన శివి పెంచలయ్య ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలకు ట్రస్టు సభ్యులు శనివారం నగదు చెక్కులను అందజేశారు. ట్రస్ట్ సభ్యులు రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### గురుకుల విద్యార్థినుల ప్రతిభ



**చేజర్ల:** జాతీయ స్థాయి పరిశోధనా కళారంగ్ పోటీ పరీక్షల్లో ఆదూరుపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ప్రతిభకనబరిచారు. ఈ ఏడాది ఆగస్టు 29న పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీ పరీక్షలకు 85 మంది విద్యార్థినులు హాజరుకాగా ముగ్గురు బహుమతులు గెలుచుకున్నారు. శనివారం వారికి ఆన్‌లైన్‌లో వచ్చిన బహుమతులను గురుకుల ప్రిన్సిపల్ శైలజా కుమారి అందజేసి అభినందించారు. గురుకులం కోఆర్డినేటర్ శ్యామలాకుమారి, వైస్ ప్రిన్సిపల్ నాగలలిత పాల్గొన్నారు.

### పారిశుధ్య పనుల పరిశీలన

**ఆత్మకూరు:** పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం పారిశుధ్య పనులు, పింఛన్ల పంపిణీని కమిషనర్ గంగా ప్రసాద్ పరిశీలించారు. తుఫాన్ నేపథ్యంలో తాగునీటికి, పారిశుధ్య పనులకు ఆటంకం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు.

# ఎడతెరిపి లేని వర్షం



కావలి: తాళ్లపాలెం చెరువులో జలకళ

**కావలి:** తుపాన్ ప్రభావంతో శనివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఉదయం నుంచి ముసురుపట్టి చెదురుమదురుగా జల్లులు పడుతూనే ఉండడంతో జనజీవనం స్తంభించింది. వర్షానికి తోడు చలిగాలులు వీయడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఓవైపు వర్షం పడుతూనే ఉన్నా రైతులు రబీ సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. కాగా తుపాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు చేయడంతో అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. అవసరమైతే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేశారు. కావలి ఆర్డీఓ ఎం వంశీకృష్ణ తీరప్రాంత మండలాల అధికారులతో నిరంతరం సమీక్షిస్తూ అప్రమత్తం చేశారు. భారీ వర్షం, ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు ఒరిగే ప్రమాదం ఉంటుందని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేసిన వెంటనే రంగంలోకి దిగాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే తక్షణమే పునరుద్ధరించాలని సూచించారు.

**అల్లూరు:** ఫెంగల్ తుపాన్ ప్రభావంతో మండలంలో శనివారం వేకువజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడుతూనే ఉంది. వర్షంతో రోడ్లు జలమయమయ్యాయి. పలుచోట్ల రోడ్లు ధ్వంసమై నీరు నిల్వ చేరడంతో వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాగా నాట్లు వేసిన పొలాలు మునిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం కొనసాగితే నాట్లు మురిగిపోతాయని వాపోతున్నారు.



కావలి: మన్నంగిదిన్నెలో పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

**తీరం అల్లకల్లోలం**

**బిట్రగుంట:** మండలంలోని తాటిచెట్లపాళెం వద్ద సముద్రం అల్లకల్లోలంగా మారింది. బంగాళాఖాతంలో ఏర్పడిన 'ఫెంగల్' తుపాన్ ప్రభావంతో శనివారం వేకువజాము నుంచే సముద్రంలో కసురు విపరీతంగా పెరిగింది. ఉవ్వెత్తున ఎగసిపడుతున్న అలలు, చీకట్లు కమ్మిన వాతావరణంతో తీరం భయానకంగా మారింది. తాటిచెట్లపాళెం వద్ద అలల ఉధృతికి తీరం కోతకు గురైంది. అలలు ఫిష్‌ల్యాండింగ్ సెంటర్‌ను తాకాయి. మధ్యాహ్నం నుంచి అలల ఉధృతి మరింతగా పెరగడంతో స్థానిక మత్స్యకారులు కూడా సముద్రం వైపు వెళ్లలేదు. కాగా తుపాన్ ప్రభావంతో ఉదయం నుంచి ముసురుపట్టి చెదురుమదురు జల్లులు పడ్డాయి.



కావలి: వర్షంతో భద్రపరిచిన వేరుశనగ విత్తనాలు

చిన్నపాటి వర్షానికి పలు చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. ఇటీవల తాత్కాలికంగా రోడ్లకు వేసిన ప్యాచ్‌వర్క్‌లు సైతం నాసిరకంగా వేయడంతో లేచిపోయాయి.

**చేజర్ల:** మండలంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. వేకువజాము నుంచి ముసురు పట్టి ఎడతెరిపి లేకుండా చిరుజల్లులు పడుతూనే ఉండడంతో జనజీవనం స్తంభించింది. కాగా వర్షం మెట్ట పటంలకు మేలు చేకూరుస్తుందని రైతులు తెలిపారు.

**ఉదయగిరిలో చిరుజల్లులు**

**ఉదయగిరి:** ఉదయగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఫెంగల్ తుపాను ప్రభావం కనిపించలేదు. జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నా ఉదయగిరి మెట్ట ప్రాంతంలో చిరుజల్లులు మాత్రమే పడ్డాయి. తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు పడుతాయని ఎంతో ఆశగా ఎదురుచూసిన రైతులకు నిరాశే మిగిలింది. కనీసం మెట్టపైరులో నేల తడిచే వాన కూడా కురవలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం అయినా వాన పడుతుందనే ఆశతో ఎదురు చూస్తున్నారు.



కావలి: కొనదిన్నె గ్రామంలో వర్షంలోనే నాట్లు వేస్తున్న కూలీలు



కావలి: వర్షంతో వెలవెలబోతున్న ఉదయగిరి బ్రిడ్జి కూడలి



కావలి: వర్షంతో బోసిపోయిన పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్



చేజర్ల మండలం ఆదూరుపల్లిలో వర్షం



బిట్రగుంట: తిప్ప–ఉడ్‌హౌస్‌పేట రోడ్డులో నిలిచిన వర్షపునీరు



బిట్రగుంట:వర్షానికి తాటిచెట్లపాళెం వద్ద దెబ్బతిన్న రోడ్డు



బిట్రగుంట: వర్షంలోనే నారును తరలిస్తున్న రైతులు



అల్లూరులో కురుస్తున్న వర్షం

# వర్షాలపై నిరంతర పర్యవేక్షణ

- ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని

**ఆత్మకూరు:** తుఫాన్ నేపథ్యంలో ఆత్మకూరు డివిజన్ పరిధిలోని అన్ని మండలాల అధికారులను అప్రమత్తం చేస్తూ నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నామని ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని తెలిపారు. శనివారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రతి మండల తహసీల్దార్, ఆత్మకూరు మున్సిపల్, ఆర్డీఓ కార్యాలయాల్లో తుఫాన్ కంట్రోల్ రూములను ఏర్పాటు చేశామన్నారు. పెన్నా పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వర్షాలు తగ్గే వరకు రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ బీ పావని

**సంగం:** సంగం సర్కిల్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ వేమారెడ్డి సూచించారు. శనివారం ఆయన సంగం సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో వాగులు వద్ద జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సహాయక చర్యల కోసం పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటారని తెలిపారు. వర్షాలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన వెంటనే తమకు సమాచారం అందజేయాలని కోరారు. ఆయన వెంట ఎస్సై రాజేష్ ఉన్నారు.

**చేజర్ల:** తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి తహసీల్దార్ మస్తానయ్య, ఎస్సై తిరుమలరావు సూచించారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. తుపాన్ తీరం దాటే సమయంలో తీవ్రమైన పెనుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. పశువుల కాపరులు, రైతులు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. పెన్నా పరీవాహక ప్రాంత గ్రామాల్లో వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. పెన్నాతీర ప్రజలను అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలిస్తామన్నారు. ఏదైనా అత్యవసరమైతే 94407 00008 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## నిషేధాజ్ఞలు సరే...పట్టించుకునే దిక్కేదీ?

**బిట్రగుంట:** బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినా, అది వాయుగుండంగా మారినా, తుఫాన్‌గా చెలరేగినా ముందుగా ప్రభావం చూపించేది తీర ప్రాంత గ్రామాల పైనే. వాతావరణశాఖ నుంచి హెచ్చరికలు వచ్చినా వెంటనే అధికార యంత్రాంగమంతా ముందుగా చేసే పని మత్స్యకారులకు వేటకు వెళ్లొద్దు అని నిషేధాజ్ఞలు జారీ చేయడమే. జిల్లాలోని తీరప్రాంత గ్రామాల్లో చేపల వేటే జీవనాధారం. ఇక్కడి మత్స్యకారులకు ఒక్క రోజు వేట నిలిచినా ఆ రోజు గడవడం కష్టమే. వేటకు వెళితే వచ్చే సంపాదనే ఆరోజు ఖర్చులతో పాటు మత్స్యకారులను పీల్చిపిప్పి చేస్తున్న రోజువారీ వడ్డీ వ్యాపారులకు (తండల్) వాయిదాలు చెల్లించేందుకు ఆధారమవుతుంది. వేటకు వెళ్ల లేని వృద్ధులు కూడా వేట సమయంలో వచ్చే చేపలను గ్రేడింగ్ చేయడం, ఆరబెట్టడం, మారుబేరాలకు అమ్ముకోవడం వంటి పనుల ద్వారా రోజులు గడుపుకునే వారు. ఈ క్రమంలో తుపాన్లు, వాయుగుండాల సమయంలో ఐదారు రోజుల పాటు వేట నిలిచిపోవడంతో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న మత్స్యకార కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఒకవైపు నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు చుక్కలు చూపిస్తుండడం, మరోవైపు వేట, వేట ఆధారిత పనులు నిలిచిపోవడంతో పూట గడుపుకునేందుకు కూడా తీరప్రాంత గ్రామాల్లోని వృద్ధులు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో తుపాన్లు, అల్పపీడనాల సమయంలో ప్రభుత్వమే బియ్యం, నిత్యావసర వస్తువులు, అత్యవసర మందులు ఉచితంగా అందించేది. ప్రస్తుతం మత్స్యకార గ్రామాల వైపు అధికారులు కన్నెత్తి చూడటం లేదు. గ్రామాలు ముంపుకు గురై రాకపోకలు నిలిచిపోతే తప్ప పట్టించుకునే పరిస్థితి లేదు. ఈ దఫా మత్స్యకార భరోసాకు కూడా ప్రభుత్వం మంగళం పాడటంతో గంగపుత్రులు ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ క్రమంలో వరుసగా అల్పపీడనాలు, వాయుగుండాల ప్రభావంతో గత నెల నుంచి తరచుగా వేటకు అంతరాయం ఏర్పడుతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### సమాచార హక్కు చట్టంపై అవగాహన



**వరికుంటపాడు :** మండలంలోని రామాపురం, జీ కొండారెడ్డిపల్లి గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు సమాచార హక్కు చట్టం–2005పై శనివారం అవగాహన కల్పించారు. ఏఓ రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగంలో జవాబుదారీతనాన్ని తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. అనంతరం దరఖాస్తు విధానంపై అవగాహన కల్పించారు. జీ కొండారెడ్డిపల్లి సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, వీఏఏలు వెంకటేశ్వర్లు, హరినాథ్ పాల్గొన్నారు.

### కారు అద్దాల ధ్వంసం

**ఉదయగిరి:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న ఆర్‌సీ రమణయ్య కారు అద్దాలను శనివారం కొందరు ఆకతాయి కుర్రాళ్లు ధ్వంసం చేశారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో ప్రమేయం ఉన్న జిలానీతో పాటు మరికొందరిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

### ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



**సంగం:** తుపాను ప్రభావంతో వర్షాలు పడుతున్న నేపథ్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సోమ్లానాయక్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కంటాబత్తిన పద్మావతమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. తొలుత ఎంపీడీఓ షాలెట్ సర్వసభ్య సమావేశం అజెండాను చదివి వినిపించారు. సర్పంచ్‌లు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

### పేద పిల్లలకు అన్నదానం

**కావలి:** పట్టణంలోని సంయుక్త సేవా సంస్థలో ఉన్న 50 మంది పేద పిల్లలకు శనివారం అన్నదానం చేశారు. పొట్టేపాలెపు కొండయ్య వర్ధంతి సందర్భంగా ఆయన కుమార్తె కళ్యాణి, అల్లుడు ప్రసాద్, కుమారుడు శ్రీధర్ సౌజన్యంతో భోజనం ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు విజయ భారత్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు వెంగళ కిరణ్‌కుమార్ తెలిపారు.

### నేడు జేవీవీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

**ఆత్మకూరు:** జనవిజ్ఞాన వేదిక ఆత్మకూరు శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని షిర్డీ సాయిరామ్ కళాశాలలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు జేవీవీ నాయకులు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి జరిగే వైద్యశిబిరంలో షుగర్, బీపీ రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి రెండు నెలలకు సరిపడా మందులను తక్కువ ధరకే అందజేయనున్నట్లు చెప్పారు. ఆత్మకూరు పరిసర ప్రాంత రోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### బ్రూసెల్లోసిస్ వ్యాక్సినేషన్ పరిశీలన

**వరికుంటపాడు:** మండలంలోని పెద్దిరెడ్డిపల్లి, టీసీపల్లె, యర్రంరెడ్డిపల్లె గ్రామాల్లో వెటర్నరీ అసిస్టెంట్లు చేపడుతున్న బ్రూసెల్లోసిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పెద్దిరెడ్డిపల్లె పశువైద్యాధికారి రాఘవేంద్రశర్మ శనివారం పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి పెయ్య దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాక్సిన్లు వేయాలని సూచించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో పశువులకు సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువుల దొడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

### 6 నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

**చేజర్ల:** మండలంలోని మైపాటివారికండ్రికలో డిసెంబర్ 6 నుంచి 8వ తేదీ వరకు అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతిరోజూ సాయంత్రం పండరి భజన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

## మండలాభివృద్ధికి సహకరించండి

- ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి

**అనుమసముద్రంపేట:** మండలాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. తొలుత మండలాధికారులు శాఖల వారీగా అభివృద్ధి, లక్ష్యాలను వివరించారు. అనంతరం సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కొన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండడం లేదని సర్పంచ్‌లు ఎంపీపీ దృష్టికి తీసుకురాగా, మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు విద్యుత్‌శాఖ అధికారులు చొరవ చూపాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఏఓ రేణుక, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండలాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మజారెడ్డి

## హాస్టల్‌లో ఉండనని మారం..ఆపైన మాయం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాలిక తండ్రి
- రెండు గంటల్లోనే పట్టుకుని అప్పగించిన పోలీసులు

**కావలి:** గిరిజన బాలికల గురుకులంలో నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థిని వసతిగృహంలో ఉండనని తండ్రి వద్ద మారం చేసింది. తండ్రి బుజ్జగించే ప్రయత్నం చేస్తుండగా మాయమైంది. దీంతో తండ్రి కావలి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా రెండు గంటల్లోనే బాలికను పట్టుకుని అప్పగించారు. ఈ ఘటన కావలిలో శనివారం చోటు చేసుకుంది. కావలి రూరల్ సీఐ జీ రాజేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు..కందుకూరు నియోజకవర్గంలోని లింగసముద్రం మండలం పెద్దపవని గ్రామానికి చెందిన కొమరగిరి అంకబాబు కుమార్తె అంకిత కావలిలోని ముసునూరు సాయిబాబా గుడి వద్ద ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో నాల్గో తరగతి చదువుతోంది. శనివారం సాయంత్రం 5.30 గంటలకు తండ్రితో కలిసి గురుకులానికి వచ్చింది. తాను వసతిగృహంలో ఉండనని, ఇంటికి వచ్చేస్తానని తండ్రితో మారం చేసింది. దీంతో తండ్రి చదువుకోవాలి కదా...ఇంటి వద్ద ఉండి ఏం చేస్తావు అంటూ కుమార్తెను బుజ్జగించసాగాడు. ఈ క్రమంలో విద్యార్థిని అక్కడి నుంచి పరుగు తీసి కనిపించకుండా మాయమైంది. చుట్టుపక్కల వెతికినా కుమార్తె జాడ తెలియకపోవడంతో కావలి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సీఐ జీ రాజేశ్వరరావు, ఎస్సై సీహెచ్ తిరుమలరెడ్డి తమ సిబ్బందితో రంగంలోకి దిగి అన్వేషించగా సాయిబాబా గుడి వద్ద ఉన్న ఓ చెట్టుపై దాక్కుని కనిపించింది. అనంతరం స్టేషన్‌కు తీసుకెళ్లి విద్యార్థినిని బుజ్జగించి తండ్రికి అప్పగించారు. దీంతో కావలి రూరల్ పోలీసులకు విద్యార్థిని తండ్రి కృతజ్ఞతలు తెలిపారు.



బాలికను తండ్రికి అప్పగించిన రూరల్ పోలీసులు

# నిరుపయోగంగా సుజల స్రవంతి పథకం

- బిల్లులు అందక నిర్వహణను నిలిపివేసిన కాంట్రాక్టర్
- 18 ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు నిలిచిన శుద్ధజలం సరఫరా

**అనుమసముద్రంపేట:** ఏఎస్‌పేట పంచాయతీ పరిధిలోని గండువారిపల్లెలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం నిరుపయోగంగా మారింది. మండలంలోని 18 ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు శుద్ధజలాన్ని అందించే లక్ష్యంతో 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం కోట్లాది రూపాయలతో ఈ పథకాన్ని ప్రారంభించింది. అందులో భాగంగా గండువారిపల్లెలో మదర్‌ప్లాంట్‌ను నిర్మించారు. ఇక్కడి నుంచి మినరల్ వాటర్‌ను ట్యాంకర్ల ద్వారా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకులకు తరలించి అందించాలని నిర్ణయించారు. అందుకోసం 15 ట్రాక్టర్లను సైతం ఏర్పాటు చేశారు. ఈ పథకం నిర్వహణను కాంట్రాక్టర్‌కు అప్పగించగా ఐదు నెలల పాటు తాగునీటిని సక్రమంగానే సరఫరా చేశారు. ఆ తరువాత లక్షలాది రూపాయల బిల్లులు బకాయిలు పడడంతో వాటర్‌ప్లాంట్‌ను కొనసాగించలేకపోయాడు. ఆ తరువాత అధికారులు కూడా పథకం నిర్వహణను పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతో ఫ్లోరైడ్ పీడిత గ్రామాల ప్రజలు తాగునీటిని కొనుగోలు చేసి తాగాల్సిన పరిస్థితి నెలకొంది. తాగునీటిని కొనుగోలు చేసే స్థోమత లేని వారు బోరు నీటినే వినియోగిస్తూ కిడ్నీ వ్యాధుల బారినపడుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున సుజలస్రవంతి ప్లాంట్‌పై రాజకీయ నాయకులు, అధికారులు దృష్టిసారించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



నిరుపయోగంగా వాటర్ ప్లాంట్



తుప్పు పట్టుతున్న వాటర్‌ను తరలించే ట్రాక్టర్లు

### వినియోగంలోకి తీసుకురావాలి

కోట్లాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం నిరుపయోగంగా మారింది. పథకాన్ని తిరిగి వినియోగంలోకి తీసుకొస్తే ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు విముక్తి లభిస్తుంది. అధికారులు స్పందించి ఆ దిశగా చర్యలు చేపట్టాలి.

– ఖాదర్‌బాషా, గండువారిపల్లె

### అంచనాలు సిద్ధం చేశాం

ఇటీవల జిల్లా అధికారులు ఎన్టీఆర్ సుజల స్రవంతిని సందర్శించి అంచనాలు సిద్ధం చేయమని ఆదేశించారు. రూ.5లక్షల విద్యుత్ బకాయిలు ఉండడంతో కనెక్షన్‌ను తొలగించారు. మదర్‌ప్లాంట్ వద్ద లెవలింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. వీటన్నింటి కోసం అంచనాలు సిద్ధం చేశాం. నిధులు మంజూరైన వెంటనే పనులు పూర్తి చేసి పథకాన్ని వినియోగంలోకి తీసుకొస్తాం.

–రవితేజ, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్